కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

ఈ ఏడాది ఇది 12వ మరణం

కోటా: ప్రవేశ పరీక్షల ఒత్తిడి మరో విద్యార్థి ఉసురు తీసింది. నీట్‌కు సిద్ధమవుతున్న ఒక విద్యార్థి రాజస్థాన్‌లోని కోటాలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రవేశ, పోటీ పరీక్షల హబ్‌గా పేరొందిన కోటాలో ఈ ఏడాది ఇది 12వ ఆత్మహత్య. బీహార్‌కు చెందిన 17 ఏండ్ల హృషిత్ కుమార్ అనే 12వ తరగతి విద్యార్థి వైద్య విద్య కోర్సులో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షకు ఇక్కడ ఒక వసతి గృహంలో ఉంటూ సిద్ధమవుతున్నాడు. రూములో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోటేమీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

లోక్‌సభ ఉప సభాపతి పదవి ఎన్డీయేకే!

న్యూఢిల్లీ: లోక్‌సభ ఉప సభాపతి పదవిని ఎన్డీయే ఎంపీతోనే భర్తీ చేయబోతున్నారు. బీజేపీ సర్కారు సంప్రదాయానికి భిన్నంగా ఈ పదవిని తమ కూటమి నేతకే ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. 2019-2024 మధ్య కాలంలో ఈ పదవిని భర్తీ చేయలేదు. ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం మరింత వేడెక్కనున్న నేపథ్యంలో, ఈసారి కొంత సమయం తర్వాత భర్తీ చేయాలని బీజేపీ పెద్దలు నిర్ణయించారు. స్పీకర్ పదవిపై టీడీపీ, జేడీయూ దృష్టి పెట్టినప్పటికీ, బీజేపీ అందుకు ససేమిరా అంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీలను సంతృప్తి పరచడంపై బీజేపీ దృష్టి సారించే అవకాశం ఉంది.

వందేభారత్ స్పీడ్ తగ్గింపు

న్యూఢిల్లీ: భారత్‌లో సెమీ హైస్పీడ్ రైళ్లయిన వందేభారత్, గతిమాన్ ఎక్స్‌ప్రెస్‌ల వేగాన్ని తగ్గించారు. ఆటోమేటిక్ రైల్వే రక్షణ వ్యవస్థ అందుబాటులోకి వచ్చే వరకు వీటి వేగాన్ని 160 నుంచి 130 కేఎంపీ హెచ్‌కు తగ్గిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం సరైన ట్రాకింగ్ వ్యవస్థ హజ్రత్ నిజాముద్దీన్-ఆగ్రా రైలు మార్గంలో మాత్రమే ఉండటంతో వందేభారత్, గతిమాన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అక్కడ మాత్రమే 160 కి.మీ వేగంతో ప్రయాణిస్తున్నాయి. రైలు ప్రమాదాలు జరగకుండా రక్షణ కల్పించే కవచ్ వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి వచ్చేవరకు వీటి వేగాన్ని 130 కి.మీకు తగ్గించాలని రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

రేపటి నుంచి అమర్‌నాథ్ యాత్ర

52 రోజులపాటు యాత్ర..

ఆగస్టు 19తో ముగింపు

జమ్ములో భక్తులకు ఆన్-స్పాట్ రిజిస్ట్రేషన్లు

శ్రీనగర్: వార్షిక అమర్‌నాథ్ యాత్ర ఈ నెల 29 శనివారం నుంచి ప్రారంభమవుతుంది. 52 రోజుల పాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 19తో ముగుస్తుంది. జమ్ముకశ్మీరులోని అనంత్‌నాగ్‌లో ఉన్న 48 కిలోమీటర్ల పొడవైన నున్‌వాన్-పహల్‌గామ్ మార్గంతోపాటు 14 కిలోమీటర్ల పొడవైన బల్తల్ మార్గంలో కూడా భక్తులు వెళ్తారు. ఓ అధికారి మాట్లాడుతూ, మొదటి భక్త బృందం శుక్రవారం తెల్లవారుజాము 4 గంటలకు భగవతి నగర్‌లోని జమ్ము బేస్ క్యాంప్ వద్ద కశ్మీరుకు బయల్దేరుతుందని చెప్పారు. భక్తుల కోసం జమ్ములో గురువారం నుంచి స్నాట్ రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్టు తెలిపారు. షెలిమార్ ప్రాంతంలో స్నాట్ రిజిస్ట్రేషన్ సెంటర్‌ను తెరిచామన్నారు.

అమెరికాలో తెలుగోళ్ల హవా

- **గత ఎనిమిదేండ్లలో 4 రెట్లు పెరిగిన తెలుగువాళ్లు**
- **ఏ రాష్ట్రం చూసినా మనోళ్లే.. అమెరికా సెన్సస్ బ్యూరో రిపోర్ట్**

న్యూయార్క్, జూన్ 27: ఏ దేశం వెళ్లినా భారతీయులుంటారు. అందులోనూ తెలుగు వాళ్లు కచ్చితంగా ఉంటారు. అయితే, అమెరికాలో మాత్రం మనోళ్లంతా పాతుకుపోతున్నారట. గత ఎనిమిదేండ్లలో తెలుగువాళ్ల జనాభా నాలుగు రెట్లు పెరిగిందట. అమెరికా సెన్సస్ బ్యూరో నివేదిక ప్రకారం.. 2016లో అమెరికాలో 3.2 లక్షల మంది తెలుగువాళ్ల జనాభా ఉండగా, 2024నాటికి ఆ సంఖ్య 12.3 లక్షలకు చేరుకున్నది. కాలిఫోర్నియాలో 2 లక్షలు, టెక్సాస్ 1.5 లక్షలు, న్యూజెర్సీ 1.1 లక్షలు, ఇల్లినాయిస్‌లో 83 వేలు, వర్జీనియాలో 78 వేలు, జార్జియాలో 52 వేల మంది తెలుగువాళ్లు ఉన్నారు. ఇందులో దాదాపు 10 వేల మంది హెచ్1బీ వీసా పొందారు. ఇక, ఏటా 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు యూఎస్ వెళ్తున్నారు. వీరిలో 80 శాతం మంది తమ వద్ద రిజిస్టర్ చేయించుకున్నవారేనని ఉత్తర అమెరికా తెలుగు సంఘం మాజీ కార్యదర్శి అశోక్ కొల్లా తెలిపారు. అక్కడికి వెళ్లిన వారిలో 75 శాతం మంది స్థిరపడ్డారు. ఎక్కువగా డల్లాస్, బేఏరియా, నార్త్ కరోలినా, న్యూజెర్సీ, అట్లాంటా, ఫ్లోరిడా, నాష్‌విల్లేలో స్థిరపడ్డారు. అమెరికాలోని 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో ఉన్నది. హిందీ, గుజరాతీ భాషల కంటే తెలుగు మాట్లాడేవారే ఎక్కువ.

ఎమర్జెన్సీ.. రాజ్యాంగంపై దాడి

పేపర్ లీక్ నిందితులపై కఠిన చర్యలు

పార్లమెంట్ ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము

అది ప్రభుత్వం ఇచ్చిన స్క్రిప్ట్: విపక్షాలు

న్యూఢిల్లీ: ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ.. దేశంలో అతిపెద్ద, చీకటి అధ్యాయం అని, రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పడిన తర్వాత, గురువారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ విధానాలకు ప్రజలు ఇచ్చిన ఆమోదంగా ఆమె అభివర్ణించారు. ఈవీఎంలు సహా ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు భగ్నమయ్యాయని ఆమె పేర్కొన్నారు. నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఆమె తన ప్రసంగంలో స్పందించారు. పారదర్శక విచారణ జరిపించి, తప్పు చేసిన వారికి శిక్ష పడేలా చేసేందుకు ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. ఆయుష్మాన్‌భారత్ యోజన కింద 70 ఏండ్లు పైబడినవారికి కూడా ఉచిత వైద్య సేవలు అందించనున్నట్టు చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ ఎంపీలు రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించి నిరసనకు దిగారు.

రాష్ట్రపతి ప్రసంగమంతా అబద్ధాలే: ఖర్గే

రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ప్రసంగం పూర్తిగా ప్రభుత్వం ఇచ్చిన స్క్రిప్ట్ అని, మొత్తం అబద్ధాలేనని పేర్కొన్నాయి. రాష్ట్రపతితో అబద్ధాలు చదివించడం ద్వారా ప్రశంసలు పొందేందుకు మోదీ వ్యర్థప్రయత్నం చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

నీట్ అంశాన్ని లేవనెత్తనున్న ప్రతిపక్షాలు

పార్లమెంటులో శుక్రవారం నీట్‌లో అక్రమాల అంశాన్ని లేవనెత్తాలని ఇండియా కూటమిలోని పార్టీలు నిర్ణయించాయి.

ప్రజాస్వామ్యంలో రాచరికపు చిహ్నాలెందుకు?

న్యూఢిల్లీ, జూన్ 27: లోక్‌సభలో స్పీకర్ ఆసనం పక్కన సెంగోల్ (రాజదండం)ను ఉంచడం వివాదాస్పదమైంది. ప్రజాస్వామ్యంలో రాజదండానికి ఉన్న ప్రాముఖ్యత ఏమిటని ప్రతిపక్ష ఎంపీలు ప్రశ్నించగా, భారతీయ సంస్కృతిని అవమానిస్తున్నారని విపక్ష సభ్యులపై బీజేపీ మండిపడింది. బంగారం పూతపూసిన ఐదు అడుగుల సెంగోల్ స్థానంలో రాజ్యాంగం ప్రతిని ఉంచాలని కోరుతూ సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆర్కే చౌదరి స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. కాగా, సమాజ్‌వాదీ పార్టీకి భారత చరిత్ర లేదా సంస్కృతి అంటే గౌరవం లేదని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు.

పేపర్స్ లీక్ చేయించా!

- **డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇప్పించా**
- **బీజేపీ మిత్రపక్షమైన ఎస్‌బీఎస్‌పీ ఎమ్మెల్యే బేడీ రాం సంచలన వ్యాఖ్యలు**
- **సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో**
- **8 పేపర్ లీక్ కేసుల్లో నిందితుడిగా బేడీ రాం**
- **ఇంకా ఎన్డీయేలో ఎలా ఉన్నాడు?: కాంగ్రెస్**

లక్నో, జూన్ 27: నీట్-యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిన వివాదం దేశవ్యాప్తంగా ఆందోళనలకు దారితీస్తున్న నేపథ్యంలో ఓ ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. బీజేపీ మిత్రపక్షమైన సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ)కి చెందిన జఖానియా ఎమ్మెల్యే బేడీ రాం అలియాస్ త్రివేణి రాం మాట్లాడుతుండగా రహస్యంగా రికార్డు చేసిన వీడియో వైరల్‌గా మారింది. తాను పేపర్ లీక్‌లకు పాల్పడినట్టు అందులో ఆయన అంగీకరించారు. డబ్బులు తీసుకొని వేర్వేరు రాష్ట్రాల్లో ఎంతో మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేలా చేశానని బేడీ రాం చెప్తున్నట్టుగా ఈ వీడియోలో ఉంది. తనకు చాలా రాష్ట్రాల్లో సంబంధాలు ఉన్నాయని, చిన్న చిన్న కేసులు తాను తీసుకోనని, ఎక్కువ మంది ఉండే పెద్ద వ్యవహారాలు అయితేనే తాను ఒప్పుకుంటానని బేడీ రాం చెప్పుకొచ్చాడు. తనకు డబ్బులు ఇస్తే కచ్చితంగా అభ్యర్థిని పాస్ చేయిస్తానని, పరీక్ష రద్దు అయితే మాత్రం తనకు సంబంధం లేదని చెప్పాడు. బేడీ రాంకు డబ్బులిచ్చినా ఉద్యోగం రాకపోవడంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒక యువకుడు అడుగుతున్న క్రమంలో ఈ చర్చ జరిగినట్టు తెలుస్తున్నది. ఆ యువకుడే బేడీ రాం మాటలను రికార్డు చేశారని స్థానిక మీడియా భావిస్తున్నది.

ఇంకా ఎన్డీయేలో ఎలా ఉన్నాడు?: విపక్షాల ప్రశ్న

బేడీ రాం వ్యాఖ్యలపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ తీవ్రంగా స్పందించాయి. బేడీ రాంకు బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని

ఎమ్మెల్యే బేడీ రాం

కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. పేపర్ లీక్‌లో తన పాత్ర ఉందని ఒప్పుకున్న తర్వాత కూడా బేడీ రాం ఇంకా ఎన్డీయేలో ఎలా ఉన్నాడని కాంగ్రెస్ ప్రశ్నించింది. పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న బీజేపీ మిత్రపక్ష నాయకుల నైతిక దిగజారుడుతనానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. ఇది సిగ్గుచేటు అని, వెంటనే బేడీ రాంను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీకి ఓటు వేసిన తల్లిదండ్రులు ఈరోజు పశ్చాత్తాపం చెందుతున్నారని, భవిష్యత్తులో బీజేపీకి ఓటు వేయబోమని శపథం చేస్తున్నారని అన్నారు.

ఎనిమిది పేపర్ లీక్ కేసుల్లో బేడీ రాం

బేడీ రాం చాలాకాలంగా పేపర్ లీక్ ముఠాను నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో తొమ్మిది కేసులు నమోదై ఉండగా వీటిల్లో ఎనిమిది కేసులు పేపర్ లీక్ ఘటనలకు సంబంధించినవేనని తెలుస్తున్నది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో రైల్వే, పోలీసు నియామక పరీక్షల ప్రశ్నాపత్రాలను లీక్ చేశాడని అతడిపై కేసులు నమోదయ్యాయి. పలు కేసుల్లో ఆయన జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో యూపీలోని ఘాజీపూర్ జిల్లా జఖానియా నియోజకవర్గం నుంచి ఎస్‌బీఎస్‌పీ తరపున ఎమ్మెల్యేగా గెలిచాడు.

గుజరాత్‌లో ప్రైవేట్ కాలేజీల దందా

సీటు వచ్చినా పైసలు ఇవ్వాల్సిందే

అధికార బీజేపీ ఎమ్మెల్యే ఆరోపణ

అహ్మదాబాద్, జూన్ 27: గుజరాత్‌లోని కళాశాల ప్రవేశాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సాక్షాత్తూ అధికార బీజేపీ ఎమ్మెల్యేనే ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే కిషోర్ కనాని ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ కాలేజీల్లో ప్రవేశాలు గుజరాత్ కామన్ అడ్మిషన్ సర్వీస్ (జీసీఏఎస్) ద్వారా జరుగుతున్నాయని, వీటి ద్వారా ప్రవేశాలు లభించినప్పటికీ కొన్ని ప్రైవేట్ కాలేజీలు అక్రమాలకు పాల్పడుతున్నాయని, అదనపు సొమ్ము కట్టనిదే వారికి ప్రవేశాలు కల్పించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రవేశానికి అర్హులైన వారు ఈ నెల 16 నుంచి 25లోగా ఆయా కాలేజీలలో రిపోర్టు చేయాలని, అయితే కొన్ని ప్రైవేట్ కాలేజీలు మెరిట్ విధానాన్ని అణగదొక్కుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా సెల్ఫ్ ఫైనాన్స్ కాలేజీల అక్రమాలకు అంతే లేదని అన్నారు. కొందరు దళారులతో వీరు ఈ దందా నడిపిస్తున్నారని ఆయన ఆరోపించారు.

'నీట్' కేసులో ఇద్దరు అరెస్ట్

- **పట్నాలో అదుపులోకి తీసుకున్న సీబీఐ**
- **ఎన్‌టీఏ ఆఫీసు వద్ద నిరసనలు**
- **ప్రధాన ద్వారానికి తాళం**

న్యూఢిల్లీ: నీట్-యూజీ పరీక్ష పేపర్ లీక్ కేసులో మనీష్ కుమార్, అశుతోష్ కుమార్ అనే వ్యక్తులను పట్నాలో సీబీఐ అరెస్టు చేసింది. పరీక్షకు ముందు కొంత మంది అభ్యర్థులకు వీరు పట్నాలోని లెర్న్ బాయ్స్ హాస్టల్‌లో వసతి కల్పించారని, అక్కడ వారికి లీక్ చేసిన పరీక్ష పత్రాల్ని, వాటి జవాబులను అందజేశారని సీబీఐ తెలిపింది.

ఎన్‌టీఏ కార్యాలయానికి తాళం

నీట్‌లో అక్రమాలకు నిరసనగా ఢిల్లీలోని జాతీయ పరీక్ష సంస్థ(ఎన్‌టీఏ) వద్ద గురువారం ఎన్ఎస్‌యూఐ నేతలు ఆందోళనకు దిగారు. ఎన్‌టీఏ కార్యాలయ ప్రధాన ద్వారానికి తాళం వేశారు.

ఎన్‌టీఏకు సుప్రీంకోర్టు నోటీసులు

నీట్ అభ్యర్థులకు అందించిన ఓఎంఆర్ షీట్‌లకు సంబంధించి ఫిర్యాదులను లేవనెత్తడానికి ఏదైనా కాలపరిమితి ఉందా? అన్నది తెలియజేయాలని సుప్రీంకోర్టు గురువారం ఎన్‌టీఏను ఆదేశించింది. ఈమేరకు నోటీసులు జారీచేసింది. అభ్యర్థులకు ఓఎంఆర్ షీట్లు రాలేదని పిటిషన్‌దారులు పేర్కొన్నారు. మరోవైపు, సిలబస్‌లో లేని పాఠ్యాంశాల నుంచి నీట్‌లో ప్రశ్నలు ఇచ్చారన్న ఆరోపణలపై ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా స్పందించాల్సిందిగా ఎన్‌టీఏ, జాతీయ మెడికల్ కమిషన్‌ను కోర్టు ఆదేశించింది.

మూడు వైపులా చుట్టుముట్టిన కార్చిచ్చు కాలిఫోర్నియాలో జాతీయ అటవీ ప్రాంతాన్ని పెద్ద ఎత్తున దగ్ధం చేస్తున్నది. 7వేల ఎకరాల అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

కర్ణాటకలో ముదిరిన 'కుర్చీ' కొట్లాట

- **సీఎం పదవి నుంచి వైదొలగాలని సిద్ధరామయ్యపై డీకే వర్గం ఒత్తిడి**
- **డీకే శివకుమార్‌ను సీఎం చేయండి**
- **సీఎంకు వొక్కలిగ స్వామీజీ విజ్ఞప్తి**
- **డీకే, సిద్ధరామయ్య సమక్షంలోనే వ్యాఖ్యలు**

బెంగళూరు, జూన్ 27: కర్ణాటక కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు ముదురుతున్నది. సీఎం కుర్చీ కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వర్గాలు కత్తులు దూసుకుంటున్నాయి. ముఖ్యమంత్రి పదవిని కాపాడుకునేందుకు సిద్ధరామయ్య, పదవిని దక్కించుకునేందుకు డీకే తెరవెనుక పావులు కదుపుతున్నారు. ఇద్దరు నేతలూ 'హైకమాండ్ నిర్ణయమే ఫైనల్' అని చెప్తున్నప్పటికీ తమ వర్గీయులతో కథ నడిపిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. సిద్ధరామయ్య ఇక సీఎం పదవి నుంచి దిగిపోయి డీకే శివకుమార్‌కు అప్పగించాలని చెన్నగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే బసవరాజు శివగంగ కోరిన మరునాడే విశ్వ వొక్కలిగ మహాసంస్థాన మఠానికి చెందిన గురువు కుమార చంద్రశేఖరనాథ స్వామీజీ ఇదే వాదనను తెరపైకి తెచ్చారు. గురువారం జరిగిన బెంగళూరు నగర వ్యవస్థాపకుడు కెంపెగౌడ జయంతి కార్యక్రమంలో వేదిక మీద సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉండగానే బాహాటంగా సిద్ధరామయ్యకు ఈ విజ్ఞప్తి చేశారు. 'అందరూ ముఖ్యమంత్రి అయి అధికారాన్ని అనుభవించారు కానీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కాలేదు. కాబట్టి ఈ పదవిని అనుభవించిన సిద్ధరామయ్య పదవిని వదులుకొని డీకే శివకుమార్‌కు ఇచ్చి ఆయనను ఆశీర్వదించాలి. సిద్ధరామయ్య అనుకుంటే ఇది తప్పకుండా జరుగుతుంది. లేకపోతే జరగదు.' అని స్వామీజీ వేదికపైనే సిద్ధరామయ్యను కోరారు. ఈ వినతిపై సిద్ధరామయ్య స్పందిస్తూ.. కాంగ్రెస్‌కు హైకమాండ్ ఉంటుందని, ఇది ప్రజాస్వామ్యమని పేర్కొన్నారు. హైకమాండ్ ఏం చెబితే అది పాటిస్తామని తెలిపారు.



డిప్యూటీ సీఎం పదవుల కోసం లొల్లి

మరోవైపు రాష్ట్రంలో మరో ముగ్గురిని ఉప ముఖ్యమంత్రులుగా నియమించాలని కొందరు మంత్రులు చేస్తున్న డిమాండ్‌పై డీకే శివకుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ డిమాండ్‌పై గురువారం ఆయన స్పందిస్తూ.. మీడియాతో మాట్లాడే నేతలు సమయం వృథా చేసుకోకుండా హైకమాండ్‌తో మాట్లాడి ఒక పరిష్కారాన్ని తీసుకురావాలని సూచించారు. వారికి ఏ పరిష్కారం కావాలంటే ఆ పరిష్కారం పొందాలని, మీడియా ముందు మాట్లాడాల్సిన అవసరం లేదని, తాను కూడా మాట్లాడబోనని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలని పలువురు కాంగ్రెస్ నేతలు చేస్తున్న డిమాండ్‌పై కూడా శివకుమార్ ఇలానే స్పందించారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా డీకే ఒక్కరే ఉన్నారు. ఆయనకు చెక్ పెట్టేందుకు సీఎం సిద్ధరామయ్య ముగ్గురు డిప్యూటీ సీఎంల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారని, తన వర్గం మంత్రుల చేత ఈ మేరకు ఆయన ప్రకటనలు చేయిస్తున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ఎన్నడూ రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొనలేదు: సీజేఐ

న్యూఢిల్లీ: న్యాయమూర్తిగా 24 ఏళ్ల పదవీ కాలంలో తాను ఎన్నడూ ప్రభుత్వం నుంచి రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొనలేదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ యూనియన్ నిర్వహించిన సెషన్‌లో అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్తూ, అప్పటికప్పుడు ఉండే భావోద్వేగాలతో సంబంధం లేకుండా, రాజ్యాంగ విధానాల ఆధారంగా స్థిరపడిన సంప్రదాయాల ప్రాతిపదికపై భారతదేశంలోని న్యాయస్థానాలు తీర్పులిస్తాయని, ఇటువంటి విధానంలో వివాదాలను పరిష్కరించడంలో దేశంలోని న్యాయమూర్తులు సుశిక్షితులని చెప్పారు.

ఢిల్లీలోని అసదుద్దీన్ ఇంటిపై దాడి

న్యూఢిల్లీ, జూన్ 27: ఢిల్లీలోని తన నివాసంపై గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారని ఎఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో గురువారం పోస్ట్ చేశారు. 34 అశోక రోడ్డులోని తన ఇంటి గేటు వద్ద ఉన్న నామఫలకంపై నల్ల ఇంకు రాసినట్టు, ఇజ్రాయెల్‌కు మద్దతుగా పోస్టర్ అంటించినట్టు ఈ వీడియోలో కనిపిస్తున్నది.

సంక్షిప్త వార్తలు

బొలీవియాలో సైనిక తిరుగుబాటు

న్యూఢిల్లీ: బొలీవియాలో సైనిక తిరుగుబాటును భగ్నం చేశారు. రాజధాని నగరంలా పాజ్‌లోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లోకి సైనికులు బుధవారం దూసుకెళ్లారు. ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఆర్మీ జనరల్ జువాన్ జోస్ జునిగాను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రెసిడెంట్ లూయిస్ ఆర్సే ఈ తిరుగుబాటును తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడానికి ప్రయత్నించే శక్తులను బొలీవియా ఎదుర్కొంటున్నదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం కోసం ఏకం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తమకు మద్దతివ్వాలని వివిధ దేశాల నేతలను కోరారు. ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ నుంచి సైనికులు బుధవారం సాయంత్రం తిరుగుముఖం పట్టారు. ప్యాలెస్‌ను పోలీసులు తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు.

లైంగిక వేధింపుల కేసులో యెడియూరప్పపై చార్జిషీట్

బెంగళూరు: మైనర్ బాలిక (17)పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నమోదైన కేసులో కర్ణాటక మాజీ సీఎం, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యెడియూరప్పపై సీఐడీ గురువారం చార్జిషీటును దాఖలు చేసింది. ఆయన డాలర్స్ కాలనీలోని తన నివాసంలో ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఈ నేరానికి పాల్పడినట్లు మార్చిలో కేసు నమోదైంది. బాలిక తల్లి (54) ఫిర్యాదు ఆధారంగా సదాశివ నగర్ పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. అయితే ఈ ఆరోపణలను యెడియూరప్ప తోసిపుచ్చారు. ఫిర్యాదు చేసిన మహిళ (54) గత నెలలో ఓ ప్రైవేటు దవాఖానలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ మరణించారు.

పోలీస్ కస్టడీలో నటి పవిత్రా గౌడ మేకప్, లిప్‌స్టిక్

బెంగళూరు: కన్నడ నటుడు దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయిన నటి పవిత్రా గౌడ పోలీస్ కస్టడీలో సైతం షూటింగ్‌కు వెళ్తున్న మాదిరిగా లిప్‌స్టిక్ వేసుకుని, పూర్తి మేకప్‌తో ఉన్న దృశ్యాలు వివాదం రేపాయి. విచారణలో భాగంగా పోలీసులు ఈ నెల 15న ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. దీంతో లోపలికి వెళ్లిన ఆమె లిప్‌స్టిక్ వేసుకుని, మేకప్ వేసుకుని నవ్వుతూ పోలీసులతో పాటు బయటకు వస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. దీంతో ఆమె నిందితురాలా, సినిమాలో హీరోయినా? అంటూ ట్రోలింగ్ ప్రారంభం కావడంతో పోలీస్ శాఖ స్పందించింది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మహిళా ఎస్ఐను వివరణ ఇవ్వాలంటూ డీసీపీ నోటీసులు జారీ చేశారు.

భారత్‌లో మైనారిటీలపై విద్వేషం ఆందోళనకరం: బ్లింకెన్

వాషింగ్టన్: భారతదేశంలో మైనారిటీల స్థితిగతులపై అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై వార్షిక స్టేట్ డిపార్ట్‌మెంట్ నివేదిక, 2023 విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్‌లో మత మార్పిడుల నిరోధక చట్టాలు, మైనారిటీలపై విద్వేష ప్రసంగాలు, మైనారిటీల ప్రార్థనా స్థలాలు, ఇళ్ల కూల్చివేతలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని చెప్పారు. దేశంలోని 10 రాష్ట్రాల్లో మత మార్పిడులను కట్టడి చేసే చట్టాలు ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది.

మాల్దీవుల అధ్యక్షుడిపై చేతబడి.. ఇద్దరు మంత్రుల అరెస్ట్

మాలే: మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుపై చేతబడి చేశారని ఆరోపిస్తూ ఇద్దరు మంత్రులను పోలీసులు అరెస్ట్ చేశారు. పర్యావరణ శాఖ మంత్రి షమనాజ్ సలీం, ఆమె భర్త ఆదం రమీజ్‌లతోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు గురువారం స్థానిక మీడియా తెలిపింది. ఆదం దేశాధ్యక్ష కార్యాలయంలో మంత్రిగా పని చేస్తున్నట్లు తెలిపింది. అయితే పోలీసులు దీనికి సంబంధించిన సమాచారాన్ని వెల్లడించేందుకు నిరాకరించారు. మాలే నగర మేయర్‌గా ముయిజ్జు, కౌన్సిల్ సభ్యులుగా షమనాజ్, రమీజ్ ఒకే సమయంలో పని చేశారు. ఆ కాలంలో ముయిజ్జుకు రమీజ్ సన్నిహితుడిగా వ్యవహరించారు.

నేడు ఇరాన్ అధ్యక్ష ఎన్నికలు..హైదరాబాద్‌లోనూ పోలింగ్

హైదరాబాద్: ఇరాన్ కొత్త అధ్యక్షుడిని శుక్రవారం ఆ దేశ ప్రజలు ఎన్నుకోనున్నారు. తెలంగాణలోని హైదరాబాద్ సహా ప్రపంచంలోని పలు ప్రాంతాలలో బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్స్‌ను ఉంచామని, అర్హులైన ఇరాన్ పౌరులు హైదరాబాద్‌లోనే తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని చెప్పారు. గత నెల హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణించారు. ఆయన మంత్రివర్గంలో ఉపాధ్యక్షుడిగా ఉన్న మహమ్మద్ మోక్బెర్ సహా నలుగురు కన్జర్వేటివ్‌లు, ఒక రిఫామిస్ట్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు.



బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

10 రోజుల్లో నాలుగోది

కిషన్‌గంజ్: ఎన్డీయే పాలిత బీహార్‌లో మరో బ